
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 26 ఆగస్టు 2025

వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలైంది.. రాష్ట్రంలో పంటల నమోదు ప్రక్రియ మాత్రం ఇంకా చేపట్టలేదు. దీనికి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి జిల్లా, మండల వ్యవసాయశాఖ కార్యాలయాలకు పంటల నమోదుకు సంబంధించిన యాప్ అందలేదు. అయితే అసలు ఈ వానాకాలం పంటల నమోదును ఆ శాఖ అధికారులు విస్మరించారా? అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల్లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవాలంటే విధిగా పంటల నమోదు చేసుకొని ఉండాలి. రైతులు తాము నమోదు చేసుకొనే పంటల ప్రకారం విక్రయ కేంద్రాలకు అవసరమైన ధ్రువపత్రాలు ఏఈవోలు జారీ చేస్తారు. ఈ ప్రక్రియ జరగాలంటే విధిగా పంటల నమోదు చేయాల్సి ఉంది. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలై మూడునెలలు పూర్తి కావొస్తుంది. నేటికీ క్రాఫ్ బుకింగ్ జరగటం లేదు.



వైరా ప్రాంతంలో పెసర పంటను యంత్రంతో కోస్తున్న దృశ్యం

పంటల నమోదు ఎప్పుడో?

- వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైే మూడు నెలలు
- వ్యవసాయశాఖ అధికారులకు అందుబాటులోకి రాని యాప్
- ఈ ప్రక్రియనే విస్మరించారా అని అన్నదాతల్లో అనుమానాలు

వైరా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక అంచనాల ప్రకారం ఆరు లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు సాగుచేశారు. అందులో వరి 2.70లక్షల ఎకరాలు, మొక్కజొన్న 1,623ఎకరాలు, పత్తి 2.23లక్షల ఎకరాలు, చెరకు 463 ఎకరాలు, వేరుశనగా 236ఎకరాలు, పెసర 18,194ఎకరాలు, మినుము 220ఎకరాలు, కంది 268ఎకరాలు, జనుము దాదాపు 87వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇవి కాకుండా మిర్చి, ఆయిల్‌పామ్, కూరగాయలు లాంటి పంటలు 500ఎకరాలకుపైగా సాగుచేశారు. ఈ పంటలన్నింటినీ క్షేత్రస్థాయిలో ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇంతవరకు పంటల నమోదు యాప్ వ్యవసాయశాఖ కార్యాలయాలకు చేరలేదు.

ఇప్పటికే చేతికొచ్చిన పెసర, మొక్కజొన్న..

ప్రస్తుతం పెసర పంట రైతు చేతికొచ్చింది. ఒకవేళ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లయితే రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి విధిగా ఏఈవోల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పెసర పంట ఆన్‌లైన్ నమోదు చేయనందున ఏఈవోలు ఈ పంట దిగుబడి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే అవకాశం ఉండదు. ఖరీఫ్ సీజన్ మొదలైన జూన్, జూలై నెలల్లోనే పంటల నమోదు చేయాల్సి ఉంది. ముఖ్యంగా మెట్ట పంటలు జూన్‌లో సాగుచేశారు. వాటి దిగుబడులు ఆగస్టు, సెప్టెంబరు నాటికి రావడం జరుగుతుంది. వాటిలో ముఖ్యంగా పెసర, మినుము, మొక్కజొన్న లాంటి పంటలున్నాయి. ఇవి మూడు నుంచి నాలుగునెలల కాలపరిమితికి చెందిన పంటలు. జూన్ మొదట్లో వేసిన పెసర పంటను ఇప్పుడు రైతులు కోస్తున్నారు. ఎంతో ఆశాజనకంగా ఉన్న పెసర పంట తమ కష్టనష్టాలను కొంతమేర తీరుస్తుందని (మిగతా 8వ పేజీలో)

డీఈవోగా అదనపు కలెక్టర్ శ్రీజ

బాధ్యతల స్వీకరణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా సోమవారం అదనపు కలెక్టర్ శ్రీజ బాధ్యతలు స్వీకరించారు. డీఈవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఈవోగా ఉన్న జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజ.. జడ్పీ కార్యాలయ డిప్యూటీ సీఈవోగా తిరిగి వెళ్లారు. జిల్లా విద్యాశాఖలో ఉన్న అనేక సమస్యలను, నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది, తదితర అంశాలపై ఐఏఎస్ అధికారి దృష్టి సారిస్తారని, విద్యాశాఖను గాడిలో పెట్టేందుకే అధిక ప్రాధాన్యమిస్తారని, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పని తీరుపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోనున్నారు.

సీట్లు 330..
అడ్మిషన్లు 69

- నిండని పాలేరు జేఎన్‌టీయూ సీట్లు
- అసౌకర్యాలు, సమస్యలే కారణం
- 29న మరోసారి 'స్పాట్'కు అవకాశం



ఖమ్మం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖకు చెందిన పాలేరు జేఎన్‌టీయూ కళాశాలలో చేరికకు విద్యార్థులు ముందుకు రావడం లేదు. ఈ కళాశాలలో 330సీట్లు ఉండగా కేవలం 69 మాత్రమే అడ్మిషన్లయ్యాయి. వాస్తవానికి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల సీట్లు పొందాలంటే మెరిట్ ర్యాంకు వస్తే తప్ప దక్కే పరిస్థితి ఉండదు. కానీ పాలేరు జేఎన్‌టీయూలో వసతులు లేకపోవడం, భవనాల సమస్య ఉండడం, పర్మినెంట్ ఫ్యాకల్టీని పూర్తిస్థాయిలో ప్రభుత్వం నియమించకపోవడంతో ఇక్కడ చేరేందుకు విద్యార్థులు విముఖత వ్యక్తం చేశారు. గత మూడు కౌన్సెలింగ్‌ల్లోనూ పాలేరులో చేరేందుకు ఇష్టపడని పరిస్థితి. మొదటి కౌన్సెలింగ్‌లో 250మందికిపైగా ఆప్షన్ పెట్టుకున్నా ఇక్కడ సౌకర్యాలు లేకపోవడం, జేఎన్‌టీయూ పాలకమండలి పాలేరు ఇంజనీరింగ్ కాలేజీని పెద్దగా పట్టించుకోకపోవడంతో భవనాల సమస్య, ఫ్యాకల్టీ సమస్య ఇప్పట్లో తీరదని భావించి విద్యార్థులు రెండో కౌన్సెలింగ్‌కు ఇతర కాలేజీలకు షిఫ్ట్ అయ్యారు. ఖమ్మంలో ప్రైవేటు కాలేజీలో 90శాతంపైగా సీట్లు నిండిపోగా జేఎన్‌టీయూలో మాత్రం స్వల్పంగా సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో సీఎస్సీ 66 సీట్లకుగాను 33, డేటాసైన్సు 66కుగాను 31, ట్రిబుల్‌ఈ66కు7, ఈసీఈ 66కు8 మొత్తం 69సీట్లు భర్తీకాగా 261సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చిన్నాచితక కాలేజీల్లో కూడా ఇన్ని సీట్లు ఖాళీలేని పరిస్థితి. ప్రభుత్వ కాలేజీలో పోటీపడి సీట్లుతీసుకోవాల్సి ఉండగా ఖాళీగా ఉన్నా ఎవరు ముందుకు రాలేదు.

పూర్తికాని భవనాల టెండర్లు..

ఈకాలేజీకి భవనాలు నిర్మించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోగా.. (మిగతా 6వ పేజీలో)

ఏసీబీకి పట్టుబడిన
ఏడీఏ

- యూరియా అమ్మకాలపై షోకాజ్ నోటీసు రద్దుకు లంచం..
- ఎరువుల దుకాణం యజమాని నుంచి రూ.25 వేలు తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ కొత్తగూడెం ఏడీఏ నర్సింహారావు

చుంచుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యూరియా అమ్మకాలకు ఇన్వాయిస్, క్రయవిక్రయాల (ఓ ఫాం) నిర్వహణ సరిగా లేవంటూ లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక గ్రామానికి చెందిన ఓ ఎరువుల షాపు యజమానికి కొత్తగూడెం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ) యు నర్సింహారావు ఈనెల23న షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆ నోటీసులను రద్దు చేయడానికి కొత్తగూడెం ఏడీఏ తన కార్యాలయానికి పిలిపించి రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా అందుకు షాపు యజమాని నిరాకరించడంతో కనీసం రూ.30వేలైనా ఇవ్వాలన్నారు. అయితే చివరకు (మిగతా 6వ పేజీలో)

విక్రయానికి రాజీవ్
స్వగృహ ఫ్లాట్స్

- నమోదు రుసుంగా రూ.2లక్షలు చెల్లించాలి
- జలజ టౌన్‌షిప్‌పై సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్‌లోని ఫ్లాట్లను విక్రయించనున్నామని.. ఆసక్తి గల ఉద్యోగులు ఈనెల 30వ తేదీ లోపు రూ.2 లక్షల చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డితో కలిసి ఆయన రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు కింద 9 ఎకరాల 22 గుంటల్లో నిర్మించిన 8 టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ఫ్లాట్‌లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. చదరపు అడుగుకు 1150 రూపాయల ధర నిర్ణయించినట్లు తెలిపారు. జలజ టౌన్ షిప్‌లో ఉన్న 8 టవర్లను ఉద్యోగులకు లాటరీ పద్ధతిన అందించనున్నట్లు చెప్పారు. సొంత ఇల్లు కావాలని ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూ తో టవర్స్ ప్రకృతి రమణీయంగా ఉన్నాయని తెలిపారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి వల్ల రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుందని, మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపు ఉండదని అన్నారు. టౌన్ షిప్ వద్ద 60 అడుగుల రోడ్డుతో పాటు జలజ టౌన్ షిప్‌కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



బ్రోచర్‌ను చూపిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఫ్లాట్‌ను కొనుగోలు చేసి మరో 1100 రూపాయలు ఖర్చు చేసుకుంటే.. అన్ని సౌకర్యాలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందన్నారు. టీజీవో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ.. టౌన్ షిప్ లో ఫ్లాట్ కొనుగోలు చేయడం వల్ల జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ఉద్యోగులకు బ్యాంకర్లు రుణాలు అందించేందుకు కూడా సుముఖంగా ఉన్నారని తెలిపారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అసోసియేషన్, హౌజింగ్ బిల్డింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూములు ఇవ్వొద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల దృష్ట్యా.. ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చడం కోసం రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్‌లో ఉన్న 576 ఫ్లాట్‌లను విక్రయిస్తున్నామని.. ఒక్కో చదరపు అడుగు 1150 రూపాయలకు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రూ. 28 లక్షలకే ఒక ఫ్లాట్ లభిస్తుందని.. ఆసక్తి గల ఉద్యోగులు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరించి..
పరిష్కారానికి ఆదేశించి..

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని, మన పరిధిలో చేయగలిగిన పనిని వెంటనే పూర్తి చేయాలని, మనం చేయలేని పక్షంలో దానికి గల కారణాలను వివరిస్తూ సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో డీఆర్డీవో ఏ.పద్మశ్రీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, ల్యాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ సంక్షేమాధికారులు సత్యనారాయణ, జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డీపీవో ఆశాలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా...

- బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన నిమ్మతోట నాగయ్య తనకు సాగర్ కాలువ బోనకల్ బ్రాంచ్ పరిధిలో ఐదేళ్ల పనిచేసిన అనుభవం ఉందని, ఔట్ సోర్సింగ్ ద్వారా లష్కర్‌గా నియామకం చేయాలని కోరాడు.
- ఖరీఫ్ సాగులో పండించిన పెసర పంటను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా ఉపాధ్యక్షుడు బాగం ప్రసాద్ కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. తుఫానుకు పెసర పంట కొంత నష్టం జరిగిందని, దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



వికలాంగుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన ప్రజలు బోడ్యా తండాకు వెళ్లే డొంక ఆక్రమణకు గురవుతుందని, ప్రభుత్వం సర్వే చేసి దారిని అభివృద్ధి చేయాలని కోరారు.
- ఖమ్మం నగరం గాంధీచౌక్‌కు చెందిన రేపాల వెంకటరావు, రైల్వే 3వ లైన్ కొరకు తన ఇంటి స్థలం 24 గజాలు తీసుకొని రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించారని, లూప్ లైన్ కొరకు మరో 17 చదరపు గజాలు జూలైలో తీసుకున్నారని, దీనికి నష్టపరిహారం రూ.17 లక్షలు ఇస్తామని నేటికీ ఇవ్వలేదని తక్షణమే చెల్లించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- నగరానికి చెందిన యనమందల కృష్ణబాబు తన కుమారుడు తెలంగాణ సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్నాడని, తన కోడలికి ప్రభుత్వ ఉద్యోగం అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

ఇర్పా స్వాతి చిత్రీకరించిన పెయింటింగ్‌లను పరిశీలించిన పీవో



పెయింటింగ్‌లను పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో బీఏ చదువుతున్న ఇర్పా స్వాతి వివిధ కళలకు సంబంధించి చేతితో చిత్రీకరించిన పెయింటింగ్ చిత్రాలను భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ సోమవారం తన ఛాంబర్‌లో పరిశీలించారు. పెయింటింగ్‌లో స్వాతి చూపిస్తున్న ఆసక్తిని గమనించడంతో గిరిజన మ్యూజియంలో పాతతరం గిరిజన సంప్రదాయానికి సంబంధించిన వాల్ పెయింటింగ్స్‌ను వేయాలని సూచించారు. అనంతరం అనంతపురం సైన్స్ కాలేజీలో బయోలాజీ సబ్జెక్టులో పీజీ చదువుతున్న ఇర్పా సాయి ప్రసన్నను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో గురుకులం అరునకుమారి, ప్రిన్సిపాల్ రజని పాల్గొన్నారు.

అంతర్జాతీయ కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో భద్రాద్రి జిల్లాకు ఐదు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

చుంచుపల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కుంగ్ ఫూ-కరాటే పోటీల్లో భద్రాద్రి జిల్లాకు ఐదు పతకాలు వరించాయి. హైదరాబాద్‌లో ముగిసిన అంతర్జాతీయ కుంగ్ ఫూ- కరాటే చాంపియన్ షిప్ -2025 పోటీలలో జిల్లాకు చెందిన బాల, బాలికలు ప్రాతినిధ్యం వహించి ప్రదర్శన కనబరిచి ఐదు పతకాలు గెలుపొందారు. అండర్ -15 బాలుర విభాగంలో కె.లిఖిత్ చరణ్ కటాస్ విభాగంలో (బంగారు పతకం), అండ ర్-10 బాలుర విభాగంలో ఎ.జశ్వంత్ (బంగారు పతకం), బి.భానుకృష్ణ (వెండి పతకం) సాధించారు. అండ ర్-12 బాలికల విభాగంలో ఏ .అశ్రిత కటాస్ విభాగంలో (బంగారు పత కం), అండర్-10 బాలికల కటాస్ విభాగంలో ఎస్.షణ్ముఖశ్రీ(కాంస్య పత కం) గెలుపొందారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు భద్రాద్రి కుంగ్ ఫూ- కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ అంతర్జాతీయ కరాటే క్రీడాకారుడు పెద్దపాటి కాశీ హుస్సేన్ సోమవారం అభినందించారు. ఈ క్రీడాకారులు కొత్తగూడెంలో శిక్షకురాలు పి.నిహారిక వద్ద శిక్షణ పొందుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్యమిషన్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో మెడికల్ ఆఫీసర్ నా లుగు పోస్టులు భర్తీకి మల్టిజోన్-1లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసి, దరఖాస్తు పూర్తి వివరాలతో నింపి, ఫారంతో పాటు జిరాక్స్ సర్టిఫికెట్స్ అన్నీ జతపరచి ఐడీఓసీలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందించాలని ఆమె సూచించారు. ఈనెల 30లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నాణ్యతకు తిలోదకాలు

- కుంగిన గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు
- కుంగిన రోడ్డు కన్పించకుండా మట్టి, కంకర పోసిన కాంట్రాక్టర్

వైరా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో వేలకోట్ల రూపాయలతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పలు చోట్ల నిర్మాణ దశలోనే కుంగిపోయింది. గత రెండునెలల నుంచి కురుస్తున్న వర్షాలతో ఖమ్మం-సోమవరం(వైరా) మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కుంగిపోయింది. కుంగిన రోడ్డు కన్పించకుండా కాంట్రాక్టర్ మట్టి, కంకర పోశారు. ముఖ్యంగా వాగులు, ఎన్నెస్పీ కాల్వలపైన నిర్మించిన అండర్ పాస్ హైలెవల్ వంతెనల సమీపంలో అప్రోచ్ రోడ్లు కుంగిపోయాయి. ఖమ్మానికి సమీపంలోని తల్లంపాడు నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుంది. తల్లంపాడు-అశ్వారావుపేట మధ్య ఆగస్టులోనే రాకపోకలు మొదలవుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినప్పటికీ ఇంకా చాలాచోట్ల వంతెనలు, రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. అయితే కొన్నినెలల కిందటే పూర్తయిన అప్రోచ్ రోడ్లు వాహనాల రాకపోకలు ప్రారంభం కాకముందే కుంగిపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌హెచ్-365బీజీ(ఖమ్మం-దేవరపల్లి) రోడ్డులో తల్లంపాడు-సోమవరం వరకు 33.604కిలోమీటర్ల రోడ్డును ఒక ప్యాకేజీగా నిర్మిస్తున్నారు. అయితే సోమవరం వద్ద వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డుపై నిర్మించిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన నుంచి ఖమ్మం వైపు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో పెద్దమునగాల, గోపవరం, చిన్నమునగాల తదితర ప్రాంతాల నుంచి వచ్చే ముత్యాలమ్మ వాగు ఉంది. ఆవాగుపైన అండర్ పాస్ హైలెవల్ వంతెన నిర్మించారు. ఈ వంతెనకు రెండువైపులా గ్రీన్‌ఫీల్డ్ హైవే అప్రోచ్ రోడ్డు నిర్మించగా ఇప్పుడు అది కుంగిపోయింది. ఒకచోట అప్రోచ్ రోడ్డు పక్కన రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంట్ వాల్స్ పక్కకు



ముత్యాలమ్మ వాగుపైన నిర్మించిన వంతెన వద్ద కుంగిన అప్రోచ్ రోడ్డుపై మట్టి పోసిన దృశ్యం

జరిగి ఖాళీలేర్పడ్డాయి. ఇది సోమవరం అండర్‌పాస్ హైలెవల్ వంతెనకు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. అదేవిధంగా చిన్నమునగాల ఎన్నెస్పీ కెనాల్ కోసం నిర్మించిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన వద్ద ఒక వైపు అప్రోచ్ రోడ్డు కుంగింది. కుంగిన చోట్ల మట్టి, కంకర పోశారు. ఇంకా పలుచోట్ల రోడ్డు ఎదుగు దిగుడుగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణంలో పటిష్టతపై అప్పుడే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం పర్యటనపై ఊహాగానాలు..

- కొనసాగుతున్న సభా ఏర్పాట్లు
- అధికారిక సమాచారం లేదంటున్న అధికారులు

చంద్రుగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఉందని అధికార పార్టీ నాయకులు ప్రచారం చేస్తుండగా అటువంటి సమాచారం అందలేదని మండలస్థాయి అధికారులు తెలిపారు. ఈ నెల 21న సీఎం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించి దామరచర్లలో జరిగే బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉండగా ఆ పర్యటన వాయిదా పడింది. దీంతో దామరచర్ల వద్ద చేపట్టిన సభా ప్రాంగణం, చంద్రుగొండలో హెలిప్యాడ్ నిర్మాణ పనులు నిలిసిపోయాయి. అయితే గత రెండు రోజుల నుంచి తిరిగి సీఎం సభ ఏర్పాటు పనులు ప్రారంభమైయ్యాయి. సభ స్థలంలో వేదిక నిర్మాణం జరుగుతుండగా, హెలిప్యాడ్ వద్ద కూలీల హడావుడి కనిపిస్తుంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అడసర్లపాడు విద్యార్థి ఎంపిక



గోపాలకృష్ణను అభినందిస్తున్న దృశ్యం

వేంసూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం అడసర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కోల గోపాలకృష్ణ ఈనెల 30,31తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ జుజ్జూరు రాఘవ తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణను హెచ్‌ఎం శీలం శ్రీనివాసరావు, పీడీ రాఘవ, ఉపాధ్యాయులు, అభినందించారు.

కూరగాయలు పండించడానికి ముందుకు రావాలి

- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్

సుజాతనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 10 గుంటల స్థలం ఉన్న ప్రతి మహిళా రైతు కూరగాయలు పండించడానికి ముందుకు రావాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం సుజాతనగర్ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలోని రవి హైబ్రిడ్ సీడ్స్ వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో కనీసం 10 గుంటల స్థలం ఉన్న ప్రతి మ హిళా రైతు కూరగాయలు పండించడానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఇందుకోసం అవసరమైన మౌళిక వసతులు (జీఐ వైరు, ఎదురు గడలు, పాలిథీన్ పేపర్, విత్తనాలు, ఫెన్సింగ్) వివరాలతో తక్కువ ఖర్చుతో డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వెయ్యి మంది మహిళా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని నాయకులగూడెం గ్రామంలో కొర్రమీను చేపల యూనిట్‌ను నిర్వహిస్తున్న మండే స్రవంతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, సుజాతనగర్ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ సుజాత, ఏపీయం ఫాం వెంకయ్య, ఏపీయం రాంబాబు, సీసీ శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పలువురికి సీపీ అభినందనలు



సీపీ సునీల్‌దత్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్ వి ధులు నిర్వహిస్తున్న 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈమేరకు సదరు కానిస్టేబుళ్ల నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సునీల్‌దత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఉద్యోగోన్నతిలో భాగంగా 22మందిని మహబూబా బాద్ జిల్లాకు, 13మందిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, ఒకరిని ఖమ్మంలో మరో ముగ్గురిని ఇతర విభాగాలకు కేటాయిస్తూ బదిలీ చేశారు.

'ఎక్సైజ్' బృందానికి డైరెక్టర్ ప్రశంస

● రూ.50వేల రివార్డు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి అరుదైన గౌరవం, రివార్డులు దక్కాయి. ఈనెల 21న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీలో ఓ గంజాయి ముఠా నుంచి గంజాయితో పాటుగా మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎక్సైజ్‌శాఖలో ఓ మైలురాయిగా నిలిచింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, అడిషనల్ కమిషనర్ ఎస్‌వై.కురేషీ, రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అడిషనల్ కమిషనర్ పీ.ప్రణవీ సోమవారం హైదరాబాద్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా బృందంలోని సభ్యులందర్నీ సన్మానించిన అనంతరం రూ.50 వేల క్యాష్ రివార్డును అందించారు. సన్మానం పొందిన వారిలో అసిస్టెంట్ కమిషనర్ జీ.గణేష్, సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ సీహెచ్ శ్రీహరిరావు, హెడ్‌కానిస్టేబుల్స్ ఎంఏ కరీం, జీ.బాలు, కానిస్టేబుల్ కే.సుధీర్, టీ.వెంకటేశ్వర్లు, పీ.హరీష్, వీ.హనుమంతరావు, పీ.విజయ్, డీ.వీరబాబు, కే.ఉపేందర్ సన్మానం, రివార్డులను పొందారు.

సీట్లు 330.. అడ్మిషన్లు 69

(5వ పేజీ తరువాయి)

గతేడాది రూ.108.60కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటి వరకు జేఎన్‌టీయూ అధికారులు టెండర్లు పూర్తిచేయలేదు. కాలేజీలో ల్యాబులు ఏర్పాటుచేయాలని పర్మినెంట్ ఫ్యాకల్టీని నియమించాలని మంత్రి పొంగులేటి జేఎన్‌టీయూ అధికారులకు పలుసార్లు విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సంఘాలు కూడా జేఎన్‌టీయూ సమస్యలు పరిష్కరించాలని ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి యోగితారాణాకు, మంత్రి పొంగులేటికి దరఖాస్తులు ఇచ్చారు. ధర్నా కూడా చేశారు. ఇప్పటి వరకు జేఎన్‌టీయూ అధికారులు కాలేజీ స్థితిగతులపై ఎలాంటి సమీక్ష చేపట్టలేదు కొత్తభవనాలు, ల్యాబులు, పూర్తిస్థాయి ఫ్యాకల్టీకి చర్యలు తీసుకోకపోవడంతో జేఎన్‌టీయూ ప్రతిష్ట దెబ్బతింటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధీనంలో ఉన్నత విద్యాశాఖ ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జేఎన్‌టీయూ కాలేజీల పరిస్థితి, సౌకర్యాలపైనా ఉన్నత స్థాయిసమీక్ష నిర్వహిస్తే కిందిస్థాయిలో ఇంజనీరింగ్ విద్యాబోధన ఎలా ఉందో, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో పరిస్థితి అర్థమవుతుంది. ప్రభుత్వం జేఎన్‌టీయూ కాలేజీ పట్ల ప్రత్యేక దృష్టిపెట్టకపోవడంతో జేఎన్‌టీయూ పాలకవర్గం కాలేజీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతోంది. సమస్యలు పైస్థాయిలోకి తీసుకెళ్లి పరిష్కారానికి పాలకవర్గం చర్యలు తీసుకోకపోవడం, కేవలం హైదరాబాద్ కాలేజీలపై దృష్టిపెట్టకపోవడం మినహా, జిల్లాలో ఉన్న జేఎన్‌టీయూలపై దృష్టి సారించకపోడంతో అడ్మిషన్లకు దరఖాస్తు చేయలేని పరిస్థితి. వచ్చే ఏడాదికి నామమాత్రపు అడ్మిషన్లు జరిగే పరిస్థితి ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జేఎన్‌టీయూ పాలకవర్గం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

29న ప్రత్యేక కౌన్సెలింగ్

పాలేరు జేఎన్‌టీయూలో ఖాళీగా ఉన్న సీట్లకు హైదరాబాద్ జేఎన్‌టీయూ డైరెక్టర్ అడ్మిషన్స్ వద్ద ప్రత్యేక కౌన్సెలింగ్ ఏర్పాటుచేశారు. ఎంసెట్‌లో క్వాలీఫై అయినా , ఎంసెట్ రాకపోయినా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కౌన్సెలింగ్‌కు వెళ్లే సదుపాయం జేఎన్‌టీయూ కల్పించిందని, ఇంజనీరింగ్‌లో చేరాలనుకున్న విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ద్వారా పొందవచ్చని పాలేరు జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఎంసెట్‌లో అర్హత ఉన్నవారు రూ.1300, ఎంసెట్ రాయకుండా ఉన్నవారు రూ.2100 కౌన్సెలింగ్ ఫీజు చెల్లించి 29 ఉదయం 10గంటలకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని అన్ని సర్టిఫికెట్లు తీసుకెళితే పాలేరు జేఎన్‌టీయూలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్టు

ఒకరు ఏరియా కమిటీ సభ్యుడు.. మరొకరు పార్టీ మెంబర్

ఇద్దరిపై కలిపి పలు రాష్ట్రాల్లో మొత్తం 157 కేసులు

వివరాలు వెల్లడించిన కొత్తగూడెం ఎస్పీ

కొత్తగూడెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పోలీసులను హతమార్చిన, పలు హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న ఇద్దరు మావోయిస్టులను మహారాష్ట్ర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు సోమవారం సంయుక్తంగా అరెస్టు చేశారు. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు, భద్రాద్రి కొత్తగూడెం స్పెషల్ పార్టీ, మహారాష్ట్ర పోలీసులు సంయుక్తంగా కొత్తగూడెం బస్టాండ్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన ఏరియా కమిటీ సభ్యుడు ఓయం బోదు అలియాస్ లోకేష్, మదన్‌తో పాటు పార్టీ మెంబర్ పోడియం రామే అలియాస్ శిల్పను అదుపులోకి తీసుకున్నట్టు భద్రాద్రి ఎస్పీ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓయం బోదు 2009లో దక్షిణ గడ్చిరోలీ డివిజన్‌లో మావోయిస్టు పార్టీలో చేరి.. అప్పటినుంచి ఆ డివిజన్‌లోనే పనిచేస్తూ 2014లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందాడు. ఇతనిపై 90కేసులు ఉన్నాయి. శిల్ప 2018లో మావోయిస్టు పార్టీలో చేరి.. అప్పటినుంచి గడ్చిరోలీ డివిజన్‌లోనే పనిచేస్తోందని.. 2024లో ఓయం బోదుతో వివాహం జరిగింది. ఆమె 67కేసుల్లో నిందితురాలిగా ఉంది. గత కొంత కాలంగా మావోయిస్టు పార్టీపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు గాలింపు చర్యల నేపథ్యంలో మావోయిస్టులు వారి స్థావరాల నుంచి తప్పించుకొని చిన్న గ్రూపులుగా వివిధ ప్రదేశాలకు పారిపోతున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పోలీసులు ఇద్దరు మావోయిస్టులను పట్టుకున్నారు. జిల్లాలోకి నిషేధిత మావోయిస్టులు ప్రవేశించకుండా జిల్లా పోలీసులు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశామని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు.

వైరా మునిసిపాలిటీలో హైడ్రామా!

ఐదు రోజులుగా మునిసిపల్ కమిషనర్ సీటుపై ట్విస్టులు

ఎట్టకేలకు కమిషనర్‌గా గురులింగం బాధ్యతల స్వీకరణ

వైరా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ కమిషనర్ బదిలీ, బాధ్యతల స్వీకరణ వ్యవహారంలో ట్విస్టుల మీద ట్విస్టులు చోటుచేసుకున్నాయి. కేవలం ఐదు రోజుల వ్యవధిలో వైరా మునిసిపల్ కమిషనర్ విషయం సర్వత్రా చర్చగా మారింది. ఈనెల 20న బదిలీపై వైరాకు వచ్చిన యు.గురులింగం సోమవారం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇదే తరుణంలో ఇక్కడి నుంచి బదిలీ అయిన కమిషనర్ చింతా వేణు విధుల నుంచి రిలీవ్ కావడంతో కథ సుఖాంతమైంది. కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న గురులింగం వెంటనే ఖమ్మం వెళ్లి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈనెల 20వ తేదీన రాష్ట్రంలోని 47 మునిసిపాల్ కమిషనర్లను మూకుమ్మడిగా బదిలీ చేశారు. వైరా కమిషనర్‌గా ఉన్న చింతా వేణును ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేయగా, అక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న గురులింగంను వైరాకు బదిలీ చేశారు. వేణు బదిలీని నిలిపివేయిస్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌పై తీవ్రవత్తిడి తీసుకువచ్చారు.



ఖమ్మం కలెక్టర్ అనుదీప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గురులింగం

కమిషనర్‌గా శుక్రవారమే బాధ్యతలు చేపట్టానని ప్రకటించిన గురులింగం ఆ వెంటనే ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను కలిసిన తర్వాత జాయినింగ్ విషయంలో స్పష్టత ఇవ్వకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు. ఆతర్వాత ఈనెల 23న వేణును వైరా కమిషనర్‌గా, గురులింగంను నందికొండ కమిషనర్‌గా కొనసాగిస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ సెక్రటరీ ఆదేశాలిచ్చారు. వేణు బదిలీ నిలిచిపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, కొంతమంది మునిసిపల్ సిబ్బంది సంబరాలు చేసుకొని స్వీట్లు పంచుకున్నారు. 24న ఏ పరిణామం చోటుచేసుకుందో కానీ సోమవారం ఉదయాన్నే గురులింగం వైరా వచ్చి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైరా కమిషనర్‌గా ఉండేందుకు ప్రయత్నించిన వేణు రిలీవై వెళ్లిపోయారు. ఈవిధంగా కేవలం ఐదు రోజుల్లో మునిసిపల్ కమిషనర్ వ్యవహారం హైడ్రామాగా సాగి సుఖాంతమైంది.

సెల్‌ఫోన్ చోరీ చేసిన కానిస్టేబుల్

రైలు ప్రయాణికురాలి ఫిర్యాదుతో అదుపులోకి ఇద్దరు

ఖమ్మంక్రైం ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గౌరవ ప్రదమైన విధుల్లో ఉన్న ఓ పోలీసు కానిస్టేబుల్ రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ నుంచి సెల్‌ఫోన్ చోరీచేశాడు. ఈ సంఘటన ఈనెల 23న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సమీపంలో జరిగింది. జీఆర్పీ సీఐ ఎన్ అంజలి కథనం మేరకు హైదరాబాద్‌లోని మణికొండకుచెందిన బండి ప్రియాంక అనే యువతి ఈనెల 23న ఉదయం సమయంలో సింహపురి ఎక్స్‌ప్రెస్‌రైలులో హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణిస్తోంది. అదే రైలులో రాచకొండ కమిషనరేట్‌లో కానిస్టేబుల్ అయిన జీఆర్పీ సికింద్రాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న యరముడి రవీందర్.. తన బావమరిది అయిన మేకల నాగసాయితో కలిసి ప్రయాణిస్తున్నాడు. ఆ రైలు డోర్నకల్ సమీప ప్రాంతంలోకి రాగానే కానిస్టేబుల్ రవీందర్ ప్రియాంకకు చెందిన ఐఫోన్‌ను దొంగిలించాడు. కొద్దిసేపటికి విషయాన్ని గుర్తించిన సదరు యువతి వెంటనే డోర్నకల్ ఎస్ఐ జె.సురేష్‌కు ఫిర్యాదు చేసి.. తనతో పాటు రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉన్నట్టు తెలిపింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని.. ఒకరు కానిస్టేబుల్ రవీందర్ అని మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం జీఆర్పీ సీఐ అంజలి

అతడి బావమరిది నాగసాయి అని గుర్తించి ఖమ్మంలోని జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ అంజలితోపాటు డోర్నకల్ జీఆర్పీ ఎస్ఐ సురేష్ విచారణ జరిపి.. కానిస్టేబుల్ రవీందర్ సెల్‌ఫోన్ దొంగిలించినట్టు అంగీకరించాడు. దీంతో అతడిపై, అతడి బావమరిదిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అంజలి తెలిపారు. వీరు జల్సాలకు అలవాటు పడి కొంతకాలంగా సెల్‌ఫోన్లు చోరీలు చేస్తున్నట్టు ఇద్దరు విచారణలో తెలిపినట్టు సీఐ అంజలి తెలిపారు.

డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ

కొణిజర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపల్లి గ్రామంలో రైతులు సోమవారం నానో యూరియాను డ్రోన్ ద్వారా వరిలో పిచికారి చేశారు. గ్రామానికి చెందిన రైతులు మేడా కృష్ణ, అర్జున్‌రావులు ఎనిమిది ఎకరాల్లో నానో యూరియాను డ్రోన్‌తో పిచికారి చేయించారు. మండల వ్యవసాయాశాఖ అధికారి బాలాజీ, ఏఈవో కుమార్‌రాజా, ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ మహీంద్రరెడ్డి రైతుల పొలాన్ని సందర్శించి నానో యూరియా పిచికారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో బాలాజీ మాట్లాడుతూ రైతులు యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను ఉపయోగించాలని కోరారు. రైతులు ఒకటి రెండు సార్లు నానో యూరియాను పిచికారి చేయడం వలన దిగుబడులు కూడా పెరుగుతాయని తెలిపారు.

మా డబ్బులు మాకివ్వండి...

పట్టణంలో ఓ దుకాణం ఎదుట బాధితుల ఆందోళన

మణుగూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బేతంచర్ల వెంకటేశ్వరరావు బావమరదులు ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు వారి వ్యాపారాభివృద్ధి కోసం పలువురి వద్ద సుమారు రెండు కోట్లు రుణం తీసుకున్నారు. వారు తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించకుండా జాప్యం చేస్తుండడంతో బాధితులు సోమవారం బేతంచర్ల వెంకటేశ్వరరావు దుకాణం వద్ద ఆందోళనకు దిగారు. గతంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయగా వారు జోక్యం చేసుకొని దుకాణదారులకు చెప్పి బాధితులకు చెల్లించాల్సిన మొత్తంలో రూ.50 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన నగదు కూడా చెల్లించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు మాకు ఏటువంటి న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. ఈ మేరకు బాధితులు దుకాణం ఎదుట ఆందోళన చేప ట్టారు. ఈ విషయం తెలుసుకున్న మణుగూరు టౌన్ సీఐ వారివద్దకు రాగా బాధితులు తమ గోడును వివరించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై స్పందిన సీఐ బాధితులకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏసీబీకి పట్టుబడిన ఏడీఏ

(5వ పేజీ తరువాయి)


షాపు నిర్వాహకుడు రూ.25వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం డిమాండ్ చేసాడంటూ ఈవిషయమై ఫెర్టిలైజర్ షాపు నిర్వాహకుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి ప్రణాళిక ప్రకారం సోమవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని కొత్తగూడెం సహాయ వ్యవసాయక సంచాలకుల కార్యాలయంలో తాను ఇస్తానన్న రూ.25 వేలు లంచం ఇవ్వగా.. ఏడీఏను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రూ.25వేలను స్వాధీనం పర్చుకున్నట్లు ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏప్రభుత్వ అధికారైనా లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 106తో పాటు అధికారిక నెంబర్ 9154388981లో సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

అధికారుల వేధింపులు, వరుస డ్యూటీలే కారణం

ఖమ్మం ఆర్‌ఎం కార్యాలయంలో ఎలుకలు మందు తాగిన

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న డ్రైవర్ సైదులుసాహెబ్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రీజియన్ పరిధిలోని మణుగూరు డిపోనకు చెందిన ఓ డ్రైవర్ రెండు రోజుల పాటు మణుగూరు నుంచి శ్రీశైలం వరకు డ్యూటీ చేశారు. ఆ మరుసటి రోజు ఆయనకే మణుగూరు నుంచి తిరుపతికి డ్యూటీ వేశారు. దీంతో తనకు చదువు సరిగా రాదని, టిమ్ మిషన్‌లో అంతా ఇంగ్లీష్ ఉంది దయచేసి నాకు టిం మిషన్ లేని రూట్లకు డ్యూటీ వేయండి అని అధికారులను వేడుకున్నా కనికరించకపోవటంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఖమ్మం నగరంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం ఆర్టీసీ రీజియన్ పరిధిలో 2012 నుంచి వివిధ డిపోల్లో పని చేస్తూ రెండు సంవత్సరాలుగా మణుగూరు డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ సైదుల్‌సాహెబ్(49)కు గతేడాది బైపాస్ సర్జరీ జరిగింది. అనంతరం కోలుకున్న అతను తిరిగి డిపోలో డ్రైవర్‌గా చేరాడు. తన ఆరోగ్య పరిస్థితులతో పాటు సరిగ్గా చదువు రాకపోవటంతో టిం మిషన్ ఉన్న రూట్లకు కాకుండా మరో రూట్‌కు డ్యూటీలు వేయండి అంటూ సంబంధిత అధికారులకు విన్నవించుకున్నాడు. అయినా అధికారులు తనను మణుగూరు డిపో నుంచి శ్రీశైలం, తిరుపతి లాంటి దూరం రూట్లకు డ్యూటీలు వేస్తున్నారని, సహాయక డ్రైవర్ ఉన్నప్పటికి ఇబ్బందులు తప్పటం లేదని ఈ విషయం ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని బాధితుడు తెలిపాడు. ఈ క్రమంలోనే ఆయన సోమవారం ఖమ్మం నగరంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయానికి వచ్చి తన బాధను ఆర్‌ఎం సరిరాంకు వివరించాడు. స్పందించిన ఆర్‌ఎం వెంటనే మణుగూరు డిపో మేనేజర్‌కు విషయం చెప్పి అతను కోరిన విధంగా టిం మిషన్ లేని రూట్లకు డ్యూటీలు వేసే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం సుమారు 40 నిమిషాలు డ్రైవర్ సైదుల్ సాహెబ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తాము పరిష్కరిస్తామని చెప్పి పంపించారు. కానీ సైదుల్ సాహెబ్ ఆర్‌ఎం కార్యాలయంలోంచి బయటకు వచ్చిన తర్వాత అప్పటికే తన వెంట తెచ్చుకున్న ఎలుకలమందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆర్‌ఎం సరిరాం, కార్యాలయం సిబ్బంది అప్రమత్తమై డ్రైవర్‌ను నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సైదుల్‌సాహెబ్‌కు భార్య మున్ని, ఇద్దరు వివాహమైన ఆడపిల్లలున్నారు. ఈ విషయమై ఆర్‌ఎం సరిరాంను వివరణ కోరగా ఉదయం తన వద్దకు వచ్చిన మాట వాస్తవమేనని, తన బాధలను చెప్పగా వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి డ్రైవర్ కోరిన విధంగా డ్యూటీలు వేయమని చెప్పామని, ఇంతలోనే అతను ఇలా చేస్తాడని ఊహించలేదని తెలిపారు. ఈ క్రమంలో ఆర్‌ఎం ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు డ్రైవర్ సైదుల్ సాహెబ్‌పై కేసు నమోదు చేశారు.

కుగ్రామం నుంచి.. న్యాయాధికారి స్థాయికి..

తల్లి కూలీ పనులు.. తండ్రి ప్రోత్సాహం

కఠోరదీక్షతో న్యాయాధికారి అయిన బిందు

తండ్రి, తమ్ముడు కూడా లాయర్లే..

అది ఓ కుగ్రామం.. నాడు ఆ గ్రామానికి వెళ్లాలంటే వాగులు, ఒర్రెలు దాటాల్సిందే.. ఆ కుగ్రామంలోనే ఓ తల్లి తన కూతురి చదువుల కోసం కూలీ పనులకు వెళ్లేది. తండ్రి కూడా ఎనలేని ప్రోత్సాహాన్ని అందించారు. ఇలా తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన వారి కూతురు చదువులో అత్యంత ధృఢ సంకల్పంతో ముందుకు సాగింది. చివరకు అనుకున్నట్టుగానే విజయం సాధించింది. ఇటీవల హైదరాబాద్‌లో సివిల్ కోర్టులో జూనియర్ న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టింది. ఆమే ఖమ్మం జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి సుదూర ప్రాంతంలో గల దంతెలబోరకు చెందిన కాటూరి బిందు. పల్లెటూరు నుంచి ఉన్నత చదువు చదివి.. న్యాయాధికారి స్థాయికి ఎదిగిన తర్వాత ఇటీవలే బిందు తన సొంతూరికి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామ మహిళలతో తన ఆనందాన్ని పంచుకుంది. మహిళలకు బట్టలు పంపిణీ చేసి వారితో మమేకమై గడిపింది. ఈ సందర్భంగా బిందు జీవన ప్రస్థానంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పాల్వంచ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండల కేంద్రానికి సుదూర ప్రాంతంలో దంతెలబోరకు చెందిన కాటూరి సంజీవరావు, సుశీలది మొదటి నుంచి నిరుపేద కుటుంబం. కూలీ పనులపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమార్తె బిందు, కుమారుడు రోహిత్‌లు ఉన్నారు. పిల్లలను ఉన్నత స్థాయి చదువులు



బిందును సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (ఫైల్)

చదివించాలనే లక్ష్యంతో.. వీరిద్దరూ గ్రామంలోని వ్యవసాయ పనుల నుంచి ఉపాధి పనుల వరకూ వెళ్లేవారు. ఈ సమయంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ.. బిందును చదివించాలనే ఆకాంక్షతో తల్లి సుశీల ప్రతీరోజు కూలీ పనులకు వెళ్లేది. దీనిద్వారా వచ్చే డబ్బుతో కూతురుని చదివించేంది. బిందును తొలుత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. ఆ తర్వాత పాల్వంచ కేంద్రంలో పది, ఇంటర్ చదివించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా.. చదివించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులిద్దరూ బిందును ప్రోత్సహించారు. ఇందుకు తగ్గట్టుగానే బిందు పదో తరగతిలో మెరిట్ మార్కులు సాధించగా.. ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం ఆమెను ఇంటర్ ఉచితంగా చదివించింది. అనంతరం ఖమ్మంలో డిగ్రీ చదివి ఎల్ఎల్‌బీ చదువుకు అర్హత పొందింది. ఆ తర్వాత ఎల్ఎల్‌బీ పూర్తి చేసుకొని జూనియర్ అసిస్టెంట్ న్యాయాధికారిగా ఉత్తీర్ణత పొందింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని స్పెషల్‌కోర్టు సివిల్ న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టింది.

తండ్రి, తమ్ముడు కూడా లాయర్లే..

పిల్లల చదువుల కోసం కాటూరి సంజీవరావు తన



కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిందుకు సన్మానం

నివాసాన్ని క్రమంగా ఖమ్మంకు మార్చాడు. బిందును డిగ్రీ చదివిస్తూ.. ఓ లాయర్ వద్ద సంజీవరావు గుమస్తాగా పని చేస్తుండేవాడు. భార్య సుశీల మాత్రం స్వగ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ వీరికి డబ్బులు పంపించేది. దీంతో సంజీవరావు తన కూతురు, కుమారుడిని చదివించుకుంటూ తాను కూడా ఎల్ఎల్‌బీ పూర్తి చేశాడు. అనంతరం కూతురు బిందును ఉన్నత చదువులు చదివిస్తూ సివిల్ జడ్జి ఎంట్రెన్స్ రాయించాడు. కూతురుతో పాటు కుమారుడు రోహిత్‌ను కూడ 'లా' చేయించాడు. ఒకే కుటుంబంలో ఒకరు సివిల్ న్యాయాధికారి కాగా.. ఇద్దరు లాయర్లు కావడం పట్ల ఆ గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల అభినందనలు

ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం బిందును సన్మానించారు. మారుమూల గ్రామం నుంచి ఈ స్థాయికి ఎదగడానికి కారణమైన ఆమె తల్లిదండ్రులు కాటూరు సంజీవరావు, సుశీలమ్మలను అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల బిందు ఈ స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. మారుమూల గ్రామాల పిల్లలు చదువుల్లో రాణించాలని కోరారు. బాగా చదువుకునే పేద పిల్లలకు ప్రభుత్వం విద్యాపరంగా అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని వారు తెలిపారు.

తల్లిదండ్రుల కష్టాన్ని చూసి చలించా..

బిందు, సివిల్ జూనియర్ న్యాయాధికారి

చిన్నతనం నుంచే నా తల్లిదండ్రులు చేసే కష్టాన్ని చూసి చలించేదాన్ని. మా అమ్మ నాట్లు వేయడం, వరికోత, పత్తి తీయడం, కలుపు తీయడం, 100రోజుల పనికి వెళ్లి తెచ్చిన డబ్బులను నా చదువు కోసం ఖర్చు పెట్టేవారు. వారి శ్రమ మర్చిపోలేనిది. తమ్ముడు రోషిత్ కూడా లాయర్ కావడం మా కుటుంబానికి ఎంతో ఆనందంగా ఉంది. అన్నింటికీ మూలం చదువే అన్న లక్ష్యంతో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలి. చదువు ద్వారానే తారతమ్య బేధాలు తొలిగిపోతాయి. న్యాయం సమపాలనలో అందించే విధంగా పని చేయడమే నా ధ్యేయం.



తల్లి సుశీలతో బిందు

అశ్వారావుపేటలో తీవ్ర ఉద్రిక్తత

లక్ష్మీప్రసన్న భర్త, ఆడపడుచు, బావలకు దేహశుద్ధి చేసిన బంధువులు

పోలీసుల వైఖరికి నిరసనగా ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు

తల్లి మృతదేహానికి అంత్యక్రియలు చేసిన ఏడేళ్ల కుమార్తె ఇనివిత నాయుడు

అశ్వారావుపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా, కల్లూరు మండలానికి చెందిన పూల లక్ష్మీ ప్రసన్న(33) ఆదివారం అశ్వారావుపేటలో అనుమానస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. సుమారు రెండేళ్లుగా ఆమెను గృహనిర్బంధం చేసి.. సరిగ్గా ఆహారం పెట్టకపోవడం,బాగోగులు చూడకపోవడం వల్ల పూర్తిగా బక్కచిక్కిపోయి మృతిచెందిందని ఆమె పుట్టింటివారు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె మృతదేహానికి ఏపీ రాష్ట్రంలోని రాజమండ్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంబులెన్స్‌లో సోమవారం మధ్యాహ్నానికి అశ్వారావుపేటకు తీసుకొచ్చారు. లక్ష్మీప్రసన్న మృతితో ఆగ్రహావేశాలకు గురైన ఆమె కుటుంబీకులు, బంధువులు సోమవారం అశ్వారావుపేటకు చేరుకొని నిందితులను వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన చర్యలు తీసుకో



అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

వాలన్నారు. ఈ మేరకు పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో వారు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఇంటివద్ద ఉన్న లక్ష్మీప్రసన్న బంధువులు కొందరు ఆమె ఆడపడుచు అయిన దాసరి భూలక్ష్మికి దేహశుద్ధి చేశారు. అంబులెన్స్‌లో లక్ష్మీప్రసన్న మృతదేహాన్ని తీసుకొస్తున్నారనే సమాచారంతో రింగ్‌రోడ్ సెంటర్‌కు చేరిన బంధువులు అంబులెన్స్‌కు ఎదురుగా బైఠాయించారు. భర్త నరేష్, ఇతర నిందితులను అరెస్ట్‌చేయాలని, తమ బిడ్డను అన్యాయంగా చంపేసారంటూ ఆరోపిస్తూ లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీంతో వందలాది మంది పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో గుమిగూడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అదే సమయంలో పోలీసు



మృతురాలి భర్త నరేష్‌కు దేహశుద్ధి చేస్తున్న బంధువులు, యువకులు

వాహనాన్ని నడుపుకుంటూ ఏ2 నిందితుడిగా ఉన్న నరేష్ బావ అయిన శ్రీను అంబులెన్స్ వద్దకు రావడాన్ని గమనించిన మృతిరాలి బంధువులు ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. పోలీస్‌స్టేషన్‌లో ఉండాల్సిన నిందితుడు ఎలా పోలీస్ వాహనాన్ని నడుపుకుంటూ వస్తున్నాడని, నిందితులతో పోలీసులు కుమ్మక్కై కేసును నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. కొందరు యువకులు శ్రీను, అక్కడికి వచ్చిన నరేష్‌కు దేహశుద్ధి చేశారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసును తప్పుదోవ పట్టించడం లేదని, అనుమానస్పద మృతిగానే కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి లక్ష్మీప్రసన్న మృతదేహాన్ని భర్త ఇంటి వద్దకు తరలించారు. ఈ సంఘటనతో పట్టణం నడిబొడ్డున దాదాపు మూడు గంటలకుపైగ తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది.

ఏడేళ్ల కుమార్తెతో తల్లి మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న చిన్నారి

తీవ్ర ఉద్రిక్తతల మధ్య లక్ష్మీప్రసన్న మృతదేహాన్ని భర్త నరేష్ ఇంటివద్దకు పోలీసులు సోమవారం సాయంత్రం చేర్చారు. అప్పటికే భర్త కుటుంబీకులందరినీ పోలీసులు అదుపులో కి తీసుకున్నారు. వారి తరుపున బంధువులు ఎవ్వరూ మృతురాలికి అంత్యక్రియలు చేసేందుకు ముందుకు రాలేదు. లక్ష్మీప్రసన్న కుటుంబసభ్యులు ఆమె భర్త కుటుంబసభ్యులు తమ కుమార్తెను దారుణంగా హింసించి చంపేశారని, మృతదేహాన్ని తీసుకెళ్లి ఏమి చే యాలంటూ ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి నిరాకరించారు. దీంతో స్థానికంగా ఉన్న కొందరు యువకులు, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి ఏడేళ్ల కుమార్తె ఇనివిత నాయుడుతో తల్లి చితికి నిప్పు అంటింపచేశారు. ఈ దృశ్యాలు చూపరులను కలచివేశాయి. సీఐ నాగరాజు, ఎస్ఐ యయాతిరాజు సిబ్బందితో కలసి ఆందోళనలను విరమింపజేశారు. కేసు విచారణ పూర్తిస్థాయిలో నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విధులను ఆటంకపరిచిన కేసు కొట్టివేత

ఆర్టీసీ సమ్మె సమయంలో నమోదైన కేసు

భద్రాచలం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ సంరక్షణ కోసం జరిగిన సమ్మె సమయంలో భద్రాచలంలోని ఆర్టీసీ అవుట్‌గేటు వద్ద పోలీసుల విధులకు ఆంటకపరిచారని ఆరోపిస్తూ నాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి బీ.భవానీ సోమవారం కొట్టివేశారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2019 సెప్టెంబరు 4న సీపీఎం, సీపీఐ, తెలుగుదేశం నాయకులు గడ్డం స్వామి, ఎస్కే అజీమ్, కె.ప్రతాప్, కవితలపై కేసు నమోదు చేశారు. వారు పోలీసుల విధులను ఆంటకంపరిచారని 144వ సెక్షన్ ఉల్లంగించి ప్రదర్శన చేశారని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను చూపలేకపోవడంతో కేసును కొట్టివేస్తూ భద్రాచలం జ్యూడీషియల్ ప్రథమశ్రేణి న్యాయాధికారి బీ.భవానీ తీర్పునిచ్చారు. ముద్దాయిల తరపున న్యాయవాదులు కొడాలి శ్రీనివాస్, కె.రాంబాబు వాధించారు.

తామర పూల కోసం వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి

దమ్మపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తామర పూలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం దమ్మపేట మండలం, మందలపల్లిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా, టీ నర్సాపురం మండలం, మద్యాహ్నపువారిగూడెంకు చెందిన పచ్చికోళ్ళ ప్రదీప్(29) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మందలపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చారు. ప్రదీప్ స్థానికంగా మరోవ్యక్తితో కలసి మందలపల్లిలోని చింతలచెరువులో తామరపూలు కోయడానికి వెళ్లారు. పూలకోసం చెరువులోకి దిగగా అక్కడ లోతుగా ఉండడంతో ప్రదీప్ నీటిలో మునిగిపోవడంతో మృతి చెందాడు. అతనితో వచ్చిన స్నేహితుని సమాచారంతో స్థానికులు మృతదేహాన్ని బైటకు తీశారు. ఈ మేరకు అందిన సమాచారంతో ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



నాగరాజు(ఫైల్)

బోనకల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామంలో సోమవారం ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనపై ఎస్ఐ వెంకన్న కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చింతల నాగరాజు(26) టెంటు సామాను అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఓ వివాహితతో ఏర్పడ్డ పరిచయంతో ఆమెను ఇంటికి తీసుకొచ్చాడు. అతడికి ఇంకా వివాహం కాక పోవడంతో పెళ్లి చేసుకున్నట్లు చెప్పి కలిసి ఉంటున్నారు. ఇందుకు అతని తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇంటి వరండాలో ఒక పక్కన ఉంటున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఆ మత్తులో నాగరాజు తాడుతో ఉరి వేసుకున్నాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. రైల్వేపోలీసుల కథనం ప్రకారం ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో గల ప్రయాణీకులు వేచి ఉండు స్థలానికి ఎదురుగా ప్లాట్‌ఫారం 1, 2 మధ్య గుర్తు తెలియని వ్యక్తి (55) మృతిచెందాడు. ఈ మృతుడు సహజ మరణం చెందాడని, మృతుని దగ్గర వివరాలు లభ్యంకాలేదని తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని ఆర్‌కే ఫౌండేషన్ సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఖమ్మం రైల్వే ఎస్ఐ కే.శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9848114202, 9963641484 నెంబరులో సంప్రదించాలని కోరారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

కల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కల్లూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొరకొప్పు ప్రసాద్ స్థానికంగా గల హీరో షోరూం వద్ద మధ్యాహ్నం సమయంలో నిలుచోని ఉండగా, అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. సదరు వాహనంపై నుంచి కిందపడుతున్నట్లు నటించారు. ఆ వ్యక్తులను మానవతా కోణంలో స్పందించిన ప్రసాద్ వారినిలేపే ప్రయత్నం చేయగా వెంటనే అతని జేబులో ఉన్న రూ.20 వేల విలువ గల సెల్‌ఫోన్‌ను దొంగలించి వాహనంపై పరారైనారు. సమీపాన గల షోరూంలోని సీసీ కేమేరాలో పరిశీలించగా వారు గుర్తుపట్టని విధంగా ఉన్నారని తెలిసింది. ఈ సంఘనపై కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు బాధితుడి నుంచి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించాలి

నవరాత్రులు, వినాయక నిమజ్జనంపై

ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైభవోపేతంగా, ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని ఖమ్మంజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కల్లూరు డివిజన్ సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, వైభవోపేతంగా జరగాలన్నారు. వినాయకచవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, మండపాలకు విద్యుత్ సరఫరా, నిమజ్జనం పాయింట్లవద్ద ఏర్పాట్లు తదితర అంశాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. విద్యుత్ మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ కాకుండా ఏర్పాట్లు చేయాలని, ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు అధికారులతో పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. గణేష్ విగ్రహం నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, నిమజ్జనం రూట్‌లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు.

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ నిమజ్జనం రోజు ఊరేగింపు కార్యక్రమం, చివరి పూజ సాయంత్రం 4.00 గంటల ప్రాంతంలో ప్రారంభించాలని ఉత్సవకమిటీ సభ్యులను కోరారు. నిమజ్జనం రోజు విగ్రహం తరలించే వాహనాలు ముందుగా బుక్ చేసుకోవాలని, విగ్రహం తరలించే రూట్ మ్యాప్ ఫైనల్ చేసుకోవాలన్నారు. మండపం సమీపంలో ఎక్కడైనా బెల్ట్‌షాపు ఉంటే, అబ్కారీశాఖ అధికారులు కట్టడి చే యాలన్నారు. ఉత్సవ కమిటీసభ్యులు వివాదాస్పద ప్రాంతాల్లో మండపాలు పెట్టవద్దని కోరారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

15 ఏళ్లుగా శ్రీ కాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీలో

మట్టి ప్రతిమల తయారీ

భక్తులకు ఉచితంగా పంపిణీకి శ్రీకారం

కల్లూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కల్లూరులోని శ్రీ కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతి ఏడాది వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకు వస్తున్నారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకొని గత 15 సంత్సరాల క్రితం నుంచి ఫ్యాక్టరీ యాజమాన్యం మట్టి వినాయక విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టింది. ఆ క్రమంలో సోమవారం కల్లూరులోని కాకతీయ షుగర్స్‌లోని కార్మికులకు గాను ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగొళ్ల నాగేశ్వరరావు, ప్లాంట్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు చేతుల మీదగా విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇప్పటికే ఫ్యాక్టరీ ప్రాంగణంలో సుమారు 1000 మట్టి వినాయక



షుగర్ ఫ్యాక్టరీలో మట్టి విగ్రహాలను తయారీ చేస్తున్న కార్మికులు

విగ్రహాలను తయారు చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచారు. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ పాలెంపాటి వీరయ్య ఆధ్యాత్మికంగా ఈ విగ్రహాలను తయారుచేసి ఉచితంగా అందించే కార్యక్రమానికి చేయూతనిస్తూ నేటి భక్త సమాజానికి ఆదర్శంగా నిలిచారు.

భావితరాలకు తెలియజేయాలనే సంకల్పం

మట్టి గణపతుల తయారీపై చిన్నారులకు శిక్షణ

భద్రాచలం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు మట్టి గణపతిని పూజించే విధానం తెలిసేలా ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నడుంబిగించారు. తాను మట్టి ప్రతిమలు చేసిఇస్తే కొంత మందికే ఇవ్వగలనని.. అదే వందలాది మంది చిన్నారులకు చేసే విధానం నేర్పితే భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని భావించారు. భద్రాచలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారా ముక్తేశ్వర్ ఆరేళ్లుగా మట్టి గణపతి విగ్రలహాల తయారీని చిన్నారులకు నేర్పుతున్నారు. ప్రస్తుతం భద్రాచలంలోని రూపా స్కూల్లో 180 మంది చిన్నారులకు మట్టి గణనాధుల్ని ఏవిధంగా తయారుచేయాలో వర్క్‌షాపు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్క్‌షాపు ద్వారా 180మంది చిన్నారులకు మట్టి గణనాధుల తయారీపై అవగాహన కల్పిస్తున్నట్లు ముక్తేశ్వర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.



మట్టి గణనాథులపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ముక్తేశ్వర్

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసం

ఏటూరునాగారం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసంచేస్తున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కవిరాజ్‌నగర్‌కి చెందిన తేజావత్ అనిల్‌నాయక్ అలియాస్ కేతన్ తనకు హైదరాబాద్‌లోని రాష్ట్ర సెక్రటేరియట్‌లో సీనియర్ ప్రభుత్వ అధికారులతో పాటు రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్నాయని నమ్మించి నిరుద్యోగ యువతను టార్గెట్‌చేశాడు. నకిలీ ఐడీ కార్డులు, జీవో కాపీలు చూపించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని వారి నుంచి డబ్బులు వసూలు చేశాడు. ఇదే క్రమంలో 2019లో ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన గొంది లావణ్యను ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. లావణ్యతో పాటు ఆమె స్నేహితులు ఇర్సా రామకృష్ణ, ఇర్సా శ్రీలేఖ, గొండి మురళీకృష్ణ, బోదేబోయిన ప్రశాంత్, జిమ్మిడి నర్సింహారావు, చెన్నూరి మహేశ్వరి, ఉమాశంకర్, చైతన్య, మన్మథరావు, కల్యాణ్ దొర, యాలం పద్మ, సుమ, సరిత, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, పవన్, ఇమామ్, అజ్మల్, మహేశ్, లక్ష్మి, ఆదిలక్ష్మి, సుమలత, తాళ్ల సునీల్, పార్వతి, మురళీలను కూడా ఈ తరహాలోనే మోసగించాడు. 2020నుంచి 2022 మధ్య కాలంలో మొత్తం 28 మంది నుంచి కేతన్ రూ.72లక్షలు వసూలు చేశాడు. డబ్బులు ఇచ్చినా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు వెంకటాపురం పోలీసులను ఆశ్రయించగా ఈనెల 16న కేసు నమోదైంది. సోమవారం వెంకటాపురం ఎస్సై తిరుపతిరావు తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండ్‌వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అనిల్‌నాయక్‌ను అరెస్టు చేశారు. నిందితుడిని తనిఖీచేయగా రెండు నకిలీ జీవో కాపీలు లభించాయని ఏఎస్పీ వెల్లడించారు.

కొత్తగూడెం మెడికల్ కళాశాలకు నామా వెంకటేశ్వరరావు పార్థీవదేహం అప్పగింత

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మెడికల్ కళాశాలకు నామా వెంకటేశ్వరరావు(65) పార్థీవ దేహం సోమవారం అప్పగించారు. వామపక్ష భావాలు కలిగిన సామాజిక కార్యకర్త, మాజీ సింగరేణి కార్మికుడు, మణుగూరు వాసి నామ వెంకటేశ్వరరావుకు గత రెండేళ్ళ క్రితం రోడ్డు ప్రమాదం సంభవించింది. అప్పటి నుంచి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య హైమావతి, ఇద్దరు సంతానం. కుటుంబసభ్యుల ఇష్టానుసారం మేరకే పార్థీవదేహాన్ని కళాశాలకు దానం చేయడానికి ముందుకు వచ్చినట్లు అసోసియేషన్ సభ్యులు ప్రకటించారు. విద్యార్థుల వైద్య అభ్యాసానికి, శరీర నిర్మాణంపై లోతైన అధ్యాయనానికి ఉపయోగపడుతుందని తెలుసుకొని కొత్తగూడెంకు చెందిన ఝాన్సీరాణి కన్ను, శరీర అవయవ దానం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకు



మెడికల్ కళాశాలకు ప్రొఫెసర్ల సమక్షంలో అందజేస్తున్న వెంకటేశ్వరరావు పార్థీవదేహం

రాలు కమల రాణి కొంచెర్ల, సభ్యులు జి.వెంకటేశ్వర్లు మెడికల్ కళాశాల అనాటమీ డిపార్ట్మెంట్ ఇంచార్జి వైద్యులు భరత్‌కుమార్, డాక్టర్ ప్రసన్న పర్యవేక్షణలో వెంకటేశ్వరరావు పార్థీవ దేహాన్ని అప్పగించారు. దేహదానం ద్వారా సమాజానికి శాశ్వతమైన సేవ చేయవచ్చని, మానవతా విలువలను మరణానంతరం కొనసాగించవచ్చనివారు అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.



అక్రమ బదిలీని రద్దు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలలో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే నిలిపివేయాలని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఉపాధ్యాయ ప్రమోషన్‌ల్లో జలగం నగర్ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ పోస్టును సోమవారం చివరి నిమిషంలో బ్లాక్ చేశారని చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి పైరవీ తెచ్చుకున్నటువంటి వ్యక్తికి ఆ ఖాళీని చూపించటం కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచినట్లని టీపీటీఎఫ్ కమిటీ ఖండించింది. ఈ విషయాన్ని సంఘం జిల్లా కమిటీ కలెక్టర్‌కి తెలియజేశారు.

టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడి మృతి



నివాళి అర్పిస్తున్న రామనాథం

ఖమ్మంమామిళ్లగూడెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్ అబ్దుల్ మజీద్ (56)ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఖమ్మం తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్ చంద్ర సోమవారం సందర్శించి నివాళులు అర్పించారు. మజీద్ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, చింతనిప్పు నాగేశ్వర రావు, బానోత్ శ్రీను, దామల శివ, బోడెపుడి రవి , మద్దినేని శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు.

పెద్దతండాలో సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్,ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పెద్దతండాలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పాలేరు డివిజన్ నాయకుడు నందిగామ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దతండా గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కాలనీలో క్రీడా ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందన్నారు. సమస్యలు అన్ని వీలైనంత త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.సంగయ్యప్రసాదరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల ధర్నా



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లస్థలాలు చూపాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు బీఆర్ఎస్ హయాంలో 130 మందికి ఇంటి పట్టాలు ఇచ్చినా, పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో అధికారులకు ప్రజావానిలో వినతితప్రం అందించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకలు ఎన్.వెంకటేష్, కొమ్ము నాగేశ్వరరావు హరీష్,కల్పన, ఉపేంద్ర, దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు శ్రీను పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చోరీ ఘటనపై ఖమ్మం ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది.వైఎస్ఆర్ నగర్‌కాలనీలో నివసించే షేక్ గౌస్‌మియా ఇంట్లో ఈనెల23న రాత్రి నిద్రిస్తున్న సమయంలో దొంగలు రెండు సెల్‌ఫోన్లు, చెవిదిద్దులు ఎత్తుకెళ్లారు. వీటివిలువ మొత్తం రూ.65వేలు ఉంటుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు.

నేత్రదానం సామాజిక బాధ్యత



అవగాహన కల్పిస్తున్న నరేందర్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానాన్ని ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్, ఆప్తామాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రామునాయక్ అన్నారు. సోమవారం ఖమ్మం ఆస్పత్రిలో నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. మరణానంతరం నేత్రాలను దానం చేస్తే మరొకరికి చూపు ప్రసాదించవచ్చన్నారు. నేత్రదాతల కుటుంబాలతో పాటు నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల పనితీరు ప్రశంసనీయమన్నారు. 2001 నుంచి 25 వరకు ఖమ్మం నేత్రనిధి నుంచి 12,410కళ్లను సేకరించి పలువురికి కంటిచూపును ప్రసాదించిందన్నారు. ఈ కార్యక్రమంలో అప్తమాలజిస్టులు, నేత్రనిధి సభ్యులు పద్మనాభం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

ఖమ్మంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిదిలోని కామంచికల్ గ్రామంలో రైతు సంఘం నాల్గవ రూరల్ మండల మహాసభ రైతు సంఘం నాయకులు పెద్ద వెంకటరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం గోదావరి జలాలను పాలేరులో కలిపి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని మహాప్రస్థానం పేరుతో జిల్లా అంతటా పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. అటువంటి సీతారామ ప్రాజెక్టును త్వరగా అనేక రూపాంతరాలు చెంది నేడు సీతారామ ప్రాజెక్టుగా నిర్మాణంలోకి వచ్చిందని అటువంటి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులక అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నంతరం 25 మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణారెడ్డి, తిరుమలయ్య, వైకుంఠం, సంగయ్యకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఖమ్మంకార్పొరేషన్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని, ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. కేఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో గణేష్ మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా, కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవో గొప్పొజి ఉపేంద్ర, మహాత్మాగాంధీ సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వివాదం లేపిన గిఫ్ట్ విగ్రహాలు

నగరంలో పంపిణీ చేసేందుకు 8వేల మట్టివిగ్రహాలను అధికారులు తెప్పించారు. అయితే కేఎంసీలోని ఎన్విరాన్‌మెంట్ అధికారి మాత్రం మరోఅడుగు ముందుకే మరో 50 ప్రత్యేకమైన మట్టివిగ్రహాలను తయారు చేయించి అధికారులకు గిఫ్టుగా ఇచ్చేందుకు తెప్పించారు. గిఫ్టువిగ్రహాలను అధికారులకు విగ్రహాల పంపిణీ కార్యక్రమంలోనే ముందుగా పంపిణీ చేశారు. తర్వాత మట్టివిగ్రహాలను పంపిణీ చేసేందుకు మెప్మాసిబ్బంది ప్రయత్నించారు. దీంతో అక్కడకు వచ్చిన ప్రజలు తమకు గిఫ్టు విగ్రహాలు కావాలని కోరారు. ఆ విగ్రహాలు అందుబాటులో లేక వెనుదిరిగారు.

» కేఎంసీలో మట్టి గణపయ్యను ఉచితంగా పంపిణీ చేసిన మేయర్



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ

కమీషన్ చెల్లించాలని రేషన్ డీలర్ల వినతి

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఐదునెలలుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్‌ను తక్షణమే విడుదల చేయాలని డీలర్ల సంఘం నాయకులు బానోతు వెంకన్న, షేక్ జానిమియా, దొండదుర్గయ్య తదితరులు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి విన్నవించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్లకు, ఆర్డీవోలకు, కలెక్టర్ వినతిపత్రాలు సమర్పించారు. సోమవారం ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఐదు నెలల నుంచి రేషన్‌డీలర్లకు కమిషన్ విడుదల కావడంలో జాప్యం జరుగుతుందని, తక్షణమే వీటిని మంజూరికి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇబ్రహీం, వెంకటనారాయణ విష్ణువర్ధన్‌రెడ్డి, కవిత పసుమర్తి సత్యం తదితరులు పాల్గొన్నారు

ఖమ్మంరూరల్: కొన్నినెలలుగా డీలర్లకు రావాల్సిన కమీషన్ డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఖమ్మం రూరల్ మండల డీలర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటి పిలుపు మేరకు సోమవారం శాంతియుతంగా నిరసన తెలియచేశారు. అనంతరం రూరల్ తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. డీలర్లకు రావాల్సిన కమీషన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదనవ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.జానీమియా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొండా దుర్గయ్య, డివిజన్ ప్రెసిడెంట్ వెంకటనారాయణ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రేషన్‌డీలర్లు, రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

వారంలో వినతులు పరిష్కారం కావాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన వినతులు వారంలోగా పూర్తి కావాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఖానాపురం ఆదర్శనగర్‌లో ర్యాంపులు తొలగించవద్దని, ఆ వీధి ప్రజలు వచ్చి విన్నవించారు. డంపింగ్‌యార్డుకు వెళ్లే రహదారిలో మరో 50 మీటర్లు వరకు సీసీ రహదారి లేక పోవటంతో స్థానికులకు ఇబ్బంది కలుగుతుందని సీపీఐ నాయకులు బోడా వీరన్న స్థానికులతో కలిసి వచ్చి కమిషనర్‌కు విన్నవించారు. ఈఈ కృష్ణలాల్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి



ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):జిల్లామైనారిటీ సంక్షేమశాఖ అధికారిగా మహమ్మద్ ముజాహిద్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జ్ బాధ్యతలలో ఉన్న పురంధర్ నుంచి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రిజిల్లా కలెక్టరేట్‌లో ప్రోటోకాల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ముజాహిద్‌ను ప్రభుత్వం జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారిగా నియమించింది. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించారు.

ఇంటర్ విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఫేషియల్ రెకగ్నీషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా విద్యార్థుల ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవిబాబు తెలిపారు. ఎస్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేయడానికి జిల్లాలో 21ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 5779 మంది మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులు హాజరు కాకపోవడటాన్ని అరికట్టడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ వరకు విద్యార్థులు కళాశాలకు హాజరు కాకపోతే వెంటనే వారి తల్లితండ్రుల చరవాణికి సందేశం వెళ్తుందన్నారు. ఈహాజరు రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నమోదు చేస్తామన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా డ్రాప్ అవుట్స్‌ను తగ్గించవచ్చునన్నారు. దీనివలన మెరుగైన ఫలితాలు సాధించవచ్చు, కళాశాలల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.



ముఖ ఆధారిత హాజరు వేస్తున్న అధ్యాపకులు

వినియోగదారుడికి కార్గో పార్శిల్ అందజేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నూతన బస్టాండ్‌లోని ఆర్టీసీ కార్గో సెంటర్‌లో ఖమ్మం నగరానికి చెందిన వినియోగదారుడి సోమవారం పార్శిల్‌ను అప్పగించారు. పార్శిల్స్ బుక్ చేసిన కొందరు వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వస్తువులు వినియోగదారుడికి ఇవ్వకుండానే ఇచ్చినట్లు మొబైల్‌కు మెస్సేజ్‌లు పంపిస్తున్న తీరుపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురించిన వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. సోమవారం ఖమ్మం నగరానికి చెందిన వినియోగదారుడి పార్శిల్‌ను అప్పగించారు. ఆంధ్రజ్యోతి కథనంతో నా పార్శిల్ అందిందని వినియోగదారుడు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపాడు.



ఆర్అండ్‌బీ డీఈఈగా వీరేందర్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి రోడ్లు భవనాల శాఖ డీఈఈగా వంశీ వీరేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.ఈయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏఈఈగా పనిచేసి పదోన్నతిపై సత్తుపల్లికి డీఈఈగా వచ్చారు. తన పరిధిలోని రోడ్లు, భవనాలు, బ్రిడ్జీలను సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తానని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల మానవ వనరుల కేంద్రం లో సోమవారం పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో పి నివేదిత మాట్లాడుతూ 1 వతరగతి నుంచి పదవ తరగతి వరకు ఆధార్ కార్డు లేని విద్యార్థుల సౌకర్యార్థంగా ఈ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బందిలు పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

కారేపల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోని పశువుల సంత వేలం పాట వాయిదా పడింది. సోమవారం ప్రారంభమైన వేలంలో పాల్గొన్న వ్యక్తి రూ.2లక్షల55 వేలకుమాత్రమే పాటపాడారు. తగినంత ఆదాయం రానందున్న వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి నల్లమోతు శేషయ్య, జూనియర్ అసిసెంట్ మోహన్ తెలిపారు.

పోలీసుల వైఫల్యంతోనే పంట ధ్వంసం

చింతకాని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చింతకాని పోలీసుల వైఫల్యం కారణంగానే సిపీఎం బోనకల్ మండల కార్యదర్శి కిలారు సురేష్ పంట ధ్వంసం జరిగిందని సిపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం చింతకాని సిపీఎం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైరాలో ఈజీఎస్ సోషల్ ఆడిట్

వైరా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా జరిగింది. రైతు వేదికలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై అడిషనల్ పీడీ శిరీష ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ను నిర్వహించారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వతేదీ మధ్య కాలంలో నిర్వహించిన పనులపై పంచాయతీల్లో డీఆర్‌పీలు సర్వే నిర్వహించి నివేదించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, ఎంపీడీవో సక్రి య, ఈజీఎస్ ఏపీవో అనురాధ, ఈజీఎస్ ఎస్సీ కృష్ణ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు కూల్చివేత

తల్లాడ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను సోమవారం కూల్చివేశారు. మల్లవరం గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా కోసం 1993లో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 1.15లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ట్యాంక్‌ను నిర్మించారు. 32 ఏళ్లకు వాటర్‌ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో మిషన్ భగీరథ అధికారులు వాటర్‌ట్యాంక్‌ను కూల్చేందుకు నిర్ణయించి, మిషన్ భగీరథ ఏఈ సింధు పర్యవేక్షణలో వాటర్‌ట్యాంక్‌ను కూల్చివేశారు. ఇదే స్థలంలో తిరిగి కొత్తగా వాటర్‌ట్యాంక్ నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు.

స్టాక్ బోర్డులను ప్రదర్శించాలి: ఏడీఏ

చింతకాని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లు దుకాణాల ఎదుట ఎరువుల స్టాక్ బోర్డును ప్రదర్శించాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర సూచించారు. సోమవారం మండల పరిధిలోని పాతర్లపాడు, కో మట్లగూడెం, నాగులవంచ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ బోర్డులు, గోదాముల పరిశీలించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.

నీట్ అకాడమీలపై చర్యలు తీసుకోండి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్న అకాడమీలపై చర్యలు తీసుకోవాలని సోమవారం భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డీవైఎఫ్ఐ), జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ జూనియర్ కళాశాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థి సంఘ నాయకులకు అకాడమీ యాజమాన్యాలకు మధ్య వాగ్వాదం నెలకొంది. డీవైఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి మాళోత్ శాంతి కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు బి.వీరభద్రం, రాష్ట్ర కోశాధికారి గుగులోత్ సూర్య ప్రకాష్ మాట్లాడారు. ఖమ్మం పట్టణంలో అనేక నీట్ కోచింగ్ సెంటర్లు వేరు వేరు అకాడమీల పేరుతో నిర్వహిస్తూ లక్షల రూపాయల ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కలెక్టర్, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి స్పందించి తప్పుడు పద్ధతుల్లో నిర్వహిస్తున్న అకాడమీలపై, ఇంటర్మీడియట్ కళాశాలలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ రామ్ చరణ్, ఎర్ర దిలీప్, ఖమ్మం పట్టణ ఇన్ చార్జి హరిచందర్, పెరుమండ్లపల్లి సిద్ధార్థ, మన్నె రాజేష్, గోపి, రాము , వెంకీ, సాయి, కౌశిక్, సుజల్ తదితరులు పాల్గొన్నారు.

షాజీదా చెరువు ఆక్రమణల నిగ్గు తేల్చండి

» ప్రజావాణిలో తహసీల్దార్‌కు చెరువు కమిటీ వినతిపత్రం

నేలకొండపల్లి, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): చెరువుమాధారం షాజీదా చెరువు ఆక్రమణల నిగ్గు తేల్చాలని సోమవారం నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో షాజీదా చెరువు అధ్యక్షుడు మహమ్మద్ ఖాసీం, సభ్యులు రాధాకృష్ణ తదితరులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. చెరువు విస్తీర్ణం 830ఎకరాలుగా ఉందని కానీ ప్రస్తుతం 610ఎకరాలు మాత్రమే ఉందన్నారు. దాదాపుగా 220ఎకరాల భూమిని చెర్వుమాధారం, భైరవునిపల్లి, నాచేపల్లి గ్రామాలకు చెందిన కొందరు ఆక్రమణదారులు ఆక్రమించుకుని చేపల చెరువులు, వరి పొలాలు సాగు చేస్తున్నారన్నారు. గతంలో రెండుసార్లు ఖమ్మంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు, ఈఈ ఇరిగేషన్‌కు, ఆర్డీఓకు సైతం వినతి పత్రాలు ఇచ్చినట్లు ఖాసీం చెప్పారు. తహసీల్దార్ చొరవ తీసుకుని షాజీదా చెరువు హద్దులను గుర్తించి చేపల సొసైటీకి అప్పగించాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతి పత్రంలో అధ్యక్షుడు ఖాసీం, రాధాకృష్ణ కోరారు. సాధ్యమైనంత త్వరగా హద్దులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని, చెరువుపై ఆధారపడి జీవించే జాలర్లకు న్యాయం చేయాలని కోరారు.

పంటల నమోదు.. ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

ఆశించిన రైతులకు 15రోజులపాటు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. చివరికి ఒకట్రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే లభిస్తుంది. ఇప్పటికే 60నుంచి 70శాతానికిపైగా పెసర కోతలు పూర్తయ్యాయి. ఈ దశలోనే పెసల ధరలు క్వింటా ఒక్కంటికి రూ.5వేలకు పడిపోయింది. రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకొని కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఒకవేళ పెసల కొనుగోలు కేంద్రాలు చేసినట్లయితే రైతులు పెసలు అమ్ముకోవడానికి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. పంటల నమోదు జరగనందున ఏఈవోలు ఆ ధ్రువపత్రాలు జారీ చేయటం సాధ్యం కాకపోవచ్చు. మరికొద్దిరోజుల్లో పత్తి దిగుబడులు కూడా రైతు చేతికొస్తాయి. ఆ పత్తి విక్రయాలకు కూడా ఏఈవోలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు వెంటనే పంటల నమోదును చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం

» సీపీఐ జిల్లా నాయకుడు కర్నాటి

నేలకొండపల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ విమర్శించారు.రైతుసంఘం ఆధ్వర్యంలో యూరియా సరఫరా చేయాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. యూరియాను తక్షణమే రైతులకు సరిపడా అందించాలంటూవినతి పత్రాన్ని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు అందించారు. ధర్నాను ఉద్దేశించి భానుప్రసాద్ మాట్లాడుతూ యూరియా సరఫరా చేయటంలో బీజేపీయేతర రాష్ట్రాల పట్ల బీజేపీ ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతున్నదన్నారు. సరిపడా యూరియాను అందించటంలో కేంద్రం విఫలమైతే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని భానుప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పాల్తియా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల సభ్యులు భాగం నర్సింహారావు, రాయల మాధవరావు, కాశిబోయిన అయోధ్యపాలపాటి అశోక్, వల్లాల కృష్ణ, చిర్రా ప్రసాద్, భూక్యా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఎన్నికల హామీలను నెరవేర్చాలి: సీపీఎం

ముదిగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా ప్రతి మహిళకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సునీ త ఎల్లిజెత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యకమంలో టీఎస్.కల్యాణ్, మంకెన దామోదర్, వేల్పు ల భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు, బట్టు రాజు, మందరపు పద్మ, కోలేటి ఉపేందర్, వెంకయ్య, మెట్టెల సతీష్ పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందించాలని నిరసన

» సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన » వినతిపత్రాల అందజేత



చింతకానిలో వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

వేంసూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మాణిక్యరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రామలక్ష్మి, పిల్లి బాస్కర్ మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడం వల్ల పంటలు నష్టపోయే ప్రమాద ముందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కొణిజర్ల: తక్షణమే వ్యవసాయపంటలకు సంపూర్ణంగా యూరియాను అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, రైతుసంఘం కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం రైతుసంఘం, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. స్వర్ణ రమేష్, తోటపల్లి సీతరాములు, దేరంగుల లక్ష్మయ్య, తండు సోమయ్య, పెదమళ్ల రత్తమయ్య, ఆదినారాయణ, సూర్యం, వెంకయ్య బాబు, సత్యనారాయణ, ఆదిరెడ్డి, నరసింహరావు పాల్గొన్నారు.

చింతకాని: కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా పెంచి రాష్ట్రంలో కొరతను నివారించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ చింతకాని మండల కమిటీ ఆధ్వర్యంలో యూరియా కొరతపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కూచిపూడి రవి, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాలరావు, దొబ్బల వెంగళరావు, కొండపర్తి బాలాజీ, కన్నెబోయిన నరసింహరావు, గోగుల ఆది, సింగారపు సత్యనారాయణ, అబ్బూరి మహేష్ పాల్గొన్నారు.

మధిర రూరల్: రైతులకు సరిపడా యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు, రైతుసంఘం మండల అధ్యక్షుడు పంగా శేషగిరిరావు ఆరోపించారు. సోమవారం సీపీఐ అనుబంధ తెలంగాణ రైతుసంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చావా మురళీకృష్ణ, ఎంఏ. రహీం, వూట్ల కొండలరావు, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, మంగళగిరి రామానుజం, చెరుకూరి వెంకటేశ్వరరావు, కొండూరి నాగేశ్వరరావు, తలారి రమేష్, రంగు నాగకృష్ణ, సట్టు అశోక్, పర్చూరి మురళీ, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, వూట్ల కామేశ్వరరావు, షేక్.కొండ పాల్గొన్నారు.

బోనకల్: ఎరువులను కొరత లేకుండా రైతులకు అందించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రైతుసంఘ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు మాట్లాడారు. తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కొంగర బాస్కరరావు, ఏలూరి పూర్ణచందర్ రావు, బుర్రి నాగేశ్వరరావు, మరీదు ఈశ్వరమ్మ, ఆకేన పవన్ పాల్గొన్నారు.

ఏన్కూరు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేకుం డా చూడాలని సీపీఐ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అమరనేని వీరభద్రం మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషగిరిరావు, ఏవో నరసింహారావుకు అందించారు. ఈకార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బానోతు రాంబాబు, మాదినేని వెంకన్న, రమేష్, బోగినబోయిన నాగేశ్వరరావు, వేముల చిన్నారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్లలో....



మధిరలో....

విప్పలమడకలో యూరియా పంపిణీ ప్రారంభం

వైరా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పలమడక గ్రామంలో రూ.28లక్షలతో నూతనంగా నిర్మించిన గరికపాడు సొసైటీ పరిధిలోని గోదాములో సోమవారం యూరియా పంపిణీని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ప్రారంభించారు. రూ.28లక్షలతో రెండేళ్ల కిందట నిర్మించిన ఈ గోదాము ఇప్పటివరకు నిరుపయోగంగా పడి ఉంది. తొలుతగా ఇప్పుడు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇక్కడకు పది టన్నుల యూరియాను కేటాయించి విప్పలమడక, లింగన్నపాలెం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్ మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చెందొద్దని అన్నారు. ఏఈవోలు వెంపటి కీర్తి, సపావత్ సైదులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీని ప్రారంభిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

పలువురికి మంత్రి తుమ్మల పరామర్శ



ద్రోణవల్లి అన్నపూర్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి/వేంసూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా సిద్దారం రోడ్‌లోని పాలవాడకు చెందిన ద్రోణవల్లి రఘు మాతృమూర్తి అన్నపూర్ణ మృతిచెందగా విజేత హాస్పిటల్ రోడ్డులోని కొత్తూరు ప్రభాకరరావు సోదరి ఆలమూరి లలితకుమారి ఇటీవల మృతిచెందగా ఆమె దశదిన కర్మలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వేంసూరు మండలంలోని కల్లూరుగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ రాచూరి గంగరాజును పరామర్శించారు. అడవి రామన్నపాలెంలో ఇటీవల మృతి చెందిన దొడ్డా గణపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, డాక్టర్ కూసంపూడి నరసింహారావు, చల్లగుళ్ల నరసింహారావు, శివా వేణు, గాదె చెన్నారావు, మదర్‌తెరిస్సా విద్యాసంస్థల అధినేత చలసాని సాంబశివరావు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూహెచ్ 2024-25 విద్యా సంవత్సరానికి గానూ గత జూన్ నెలలో నిర్వహించిన బీటెక్ ద్వితీయ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ అటానమస్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏఐఎంఎల్‌లో శ్రీరాముల మహిమాజ్యోతి, దూబగుంట్ల దుర్గాభావన, రాజవరపు ఇందూకీర్తి, దూది గోవర్ధన చక్రవర్తి, సీఎస్సీ నుంచి నీలం రవిత్రేని, కిష్టా రుక్మిణీదేవి, ఓగిరాల శిరీషా, తల్లపనేని నందిని, వేముల విజయ, కేమ శ్రీవర్షిణీ, మేడా శివకృష్ణ, ఈసీఈ నుంచి షేక్ షబానా, బొర్రా సాయిధృతి, మల్లెల్లి సాయిహర్షిత, సివిల్ ఇంజనీరింగ్‌లో దేవళ్ల జూప్రమ్‌చంద్, బచ్చలి నవీన్, మెకానికల్ ఇంజనీరింగ్‌లలో వాంకుడోత్ జశ్వంత్, జక్కంపూడి ఉమామహేశ్వరరావు, నాగళ్ల అజయ్‌కుమార్, మైనింగ్ ఇంజనీరింగ్‌లో కోటా ప్రవీణ్, కాకాటి కల్యాణ్, ధర్మరాజుల భరత్‌లు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ సేవలు అభినందనీయం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

తల్లాడ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):పేదల సహాయార్థం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్ఐ బి.వెంకటేష్, ఈవో కృష్ణారావు, ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్, కార్యదర్శి ఎం.జయరాజు ప్రసంగించారు. బ్రోచర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మునుకూరి అప్పిరెడ్డి, ఎండీ ముస్తఫా, షేక్ మెహరాజ్, గురిజాల నారాయణరావు, రుద్రాక్ష నరసింహాచారి, అద్దంకి సురేష్, గొడ్ల శ్రీనివాసరావు, జి.నాగబాబు, మేడి రాంబాబు, యాకుబ్, గుమ్మా నరేష్, వాడపల్లి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతోనే వేడుకలు జరుపుకొందాం

సత్తుపల్లి, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను మట్టి విగ్రహాలతోనే జరుపుకుందామని జేవీఆర్ ఓసీ పీవో ఎన్వీఆర్.ప్రహ్లాద్ అన్నారు. సోమవారం జేవీఆర్ ఓసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సింగరేణి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓసీ అధికారులు బీ.రాజేశ్వర్‌రావు, జీ.కల్యాణ్, బీ.నరసింహారావు, ఎస్.రామారావు, గోవిందు, దేవదాస్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైరాలో ఈజీఎస్ సోషల్ ఆడిట్

వైరా, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా జరిగింది. రైతు వేదికలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై అడిషనల్ పీడీ శిరీష ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ను నిర్వహించారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వతేదీ మధ్య కాలంలో నిర్వహించిన పనులపై పంచాయతీల్లో డీఆర్‌పీలు సర్వే నిర్వహించి నివేదించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, ఎంపీడీవో సత్రి య, ఈజీఎస్ ఏపీవో అనురాధ, ఈజీఎస్ ఎస్సీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు తీరని అన్యాయం

ఏన్కూరు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతిపై సుంకం పూర్తిగా తొలిగించడం వల్ల పత్తి రైతులకు తీరని అన్యాయం జరుగుతుదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాయమాదారం గ్రామంలో రైతుసదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసదస్సులో రైతుసంఘం మండల కార్యదర్శి గుండా సత్యనారాయణరెడ్డి, కొడెం భిక్షం, ముక్తి లక్ష్మణరావు, మన్నేపల్లిరాము, మన్నేపల్లి పద్మ, భూపతి శ్రీనివాసరావు, తెగుళ్ల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, జాని, వీరన్న పాల్గొన్నారు.

స్టాక్ బోర్డులను ప్రదర్శించాలి: ఏడీఏ

చింతకాని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లు దుకాణాల ఎదుట ఎరువుల స్టాక్ బోర్డును ప్రదర్శించాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర సూచించారు. సోమవారం మండల పరిధిలోని పాతర్లపాడు, కోమట్లగూడెం, నాగులవంచ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ బోర్డులు, గోదాముల పరిశీలించి డీలర్లుకు పలు సూచనలు చేశారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు రైతులకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు కూల్చివేత

తల్లాడ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న వాటర్‌ట్యాంక్‌ను సోమవారం కూల్చివేశారు. మల్లవరం గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా కోసం 1993లో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 1.15లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. 32 ఏళ్లకు వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో మిషన్ భగీరథ అధికారులు వాటర్‌ట్యాంక్‌ను కూల్చేందుకు నిర్ణయించి, మిషన్ భగీరథ ఏఈ సింధు పర్యవేక్షణలో వాటర్‌ట్యాంక్‌ను కూల్చివేశారు. ఇదే స్థలంలో తిరిగి కొత్తగా వాటర్‌ట్యాంక్ నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు.

టై, బెల్టుల పంపిణీ

మధిర రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొమరగిరి శ్రావణ్‌కుమార్, లత దంపతులు రూ.25వేల విలువైన టై, బెల్టులు, ఐడీకార్డులు, షూలు, అలాగే బంకా రవి, హేకల్యా దంపతులు రూ.20వేల విలువైన జీరాక్స్ ప్రింటర్‌ను సమకూర్చగా సొసైటీ ఛైర్మన్ కోట వెంకట కృష్ణ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వై.ప్రభాకర్, గ్రామ కార్యదర్శి భాస్కర్, సొసైటీ డైరెక్టర్ నన్నేబోయిన గంగరాజు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయశ్రీ, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కృష్ణారావు, సూదుల లక్ష్మీ, పగిడిపల్లి డేవిడ్, సంజీవరావు, పగిడిపల్లి ప్రసాద్, కోట వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, కృపమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఆందోళన

పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్ వెంటనే చెల్లించాలని రేషన్‌డీలర్లు మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్‌ను వేరు వేరుగా కాకుండా పాత పద్ధతిలో ఒకేసారి జమ చేయాలని కోరారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు డీలర్లకు ప్రభుత్వం కమిషన్ చెల్లించకపోవడం వల్ల డీలర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులకు వినతి పత్రాలను అందజేశారు.



వేంసూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్లు



ఎర్రుపాలెంలో....



ముదిగొండలో....

వివాదాలను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించదు

బోనకల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అరాచకాలు, వివాదాలను ప్రోత్సహించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీకి లేదని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, ఆత్మ కమిటీ ఛైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావులు హితవు పలికారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో చేబ్రోలు వెంకటేశ్వర్లు, బీపీ నాయక్, మరీదు శ్రీను, భద్రు నాయక్, ఏసుపోగు హేమూన్, ఇండ్ల నాని, వెంకటకృష్ణ తదితరులున్నారు.

సంత వేలం వాయిదా

కారేపల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోని పశువుల సంత వేలం పాట వాయిదా పడింది. సోమవారం ప్రారంభమైన వేలంలో పాల్గొన్న వ్యక్తి రూ.2లక్షల55 వేలకుమాత్రమే పాటపాడారు. తగినంత ఆదాయం రానందున్న వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి నల్లమోతు శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్ తెలిపారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని మండల మానవ వనరుల కేంద్రంలో సోమవారం పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో పి నివేదిత మాట్లాడుతూ 1 వతరగతి నుంచి పదవ తరగతి వరకు ఆధార్ కార్డు లేని విద్యార్థుల సౌకర్యార్థంగా ఈ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బందిలు పాల్గొన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ

బోనకల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్సీలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు ఎంఈవో దామాల పుల్లయ్య వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మంలో జరిగిన అలింకో క్యాంపు నందు గుర్తించిన నలుగురికి వారికి అవసరమయ్యే పరికరాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఆర్‌పీ రేగళ్ల పుల్లారాణి, మల్లికార్జున్, నాగులమీరా, పాషా, అబ్రహం తదితరులున్నారు.

కల్లూరులోనే గిరిజన పాఠశాలను కొనసాగించాలి

కల్లూరు, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను వేరే ప్రాంతానికి తరలించకుండా కల్లూరులోనే కొనసాగించాలని కల్లూరులో సోమవారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థినీలు ఆందోళనలో పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె నాగుల్‌మీరా, వేము సందేశ్, క్రాంతి, తనీష్, ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలు పాల్గొన్నారు.

కల్లూరులోనే గిరిజన ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ప్రవీణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణార్జునరావు, సామినేని హనుమంతరావు, బెజవాడ సాయి శేషు, వెంకటలక్ష్మి, బాలాజీ, భాను, పార్వతి, ప్రవీణ్ కార్తీక్ పాల్గొన్నారు.

పోలీసుల వైఫల్యం కారణంగా పంట ధ్వంసం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

చింతకాని, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చింతకాని పోలీసుల వైఫల్యం కారణంగానే సీపీఎం బోనకల్ మండల కార్యదర్శి కిలారు సురేష్ పంట ధ్వంసం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం చింతకాని సీపీఎం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు నిష్పక్షపాతంగా న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, రాచబంటి రాము, బంధం శ్రీనివాసరావు, నన్నక కృష్ణమూర్తి, గడ్డం రమణ పాల్గొన్నారు.

మంచంపట్టిన పైనంపల్లి తండా

ఏన్కూరు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైనంపల్లి తండా గ్రామం జ్వరాలతో మంచంపట్టింది. రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. గ్రామంలో డెంగీ కేసులు విస్తరించకుండా సోమవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈవైద్యశిబిరంలో ఏఎంవో వెంకటరావుయాదవ్, ఎంపీడీవో జీఏస్ నారాయణ, పీహెచ్‌సీ వైద్యులు రాము లు, హెచ్‌ఈవో వేణుగోపాల్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

కారేపల్లి సొసైటీ కార్యాలయం తనిఖీ

కారేపల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో యూరియా నిల్వలను జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య సోమవారం తనిఖీ చేశారు. నిల్వల గురించి వ్యవసాయ అధికారి బట్టు అశోక్‌కుమార్, సీఈవో బొల్లు హనుమంతరావులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు.

మట్టి గణపతుల విగ్రహాలను పూజించండి

పెనుబల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలను భక్తితో పూజించి పర్యావరణాన్ని రక్షించాలని అటవీశాఖ జిల్లా అధికారి విక్రమసింగ్ అన్నారు. సోమవారం వీయంబంజర్‌లో అటవీ శాఖ, లక్ష్య స్కూల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. తహసీల్దార్ నారాయణమూర్తి, ఎంపీడీవో అన్నపూర్ణ, ప్రిన్సిపాల్ పాలగాని ఈశ్వర్ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ డీఈఈగా వంశీ వీరేందర్



సత్తుపల్లిరూరల్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి రోడ్లు భవనాల శాఖ డీఈఈగా వంశీ వీరేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏఈఈగా పనిచేసి పదోన్నతిపై సత్తుపల్లికి డీఈఈగా వచ్చారు. తన పరిధిలోని రోడ్డు, భవనాలు, బ్రిడ్జీలను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తానని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పంటల నమోదు.. ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

ఆశించిన రైతులకు 15రోజులపాటు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. చివరికి ఒకట్రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే లభిస్తుంది. ఇప్పటికే 60నుంచి 70శాతానికిపైగా పెసర కోతలు పూర్తయ్యాయి. ఈ దశలోనే పెసల ధరలు క్వింటా ఒక్కింటికి రూ.5వేలకు పడిపోయింది. రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకొని కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఒకవేళ పెసల కొనుగోలు కేంద్రాలు చేసినట్లయితే రైతులు పెసలు అమ్ముకోవడానికి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. పంటల నమోదు జరగనందున ఏఈవోలు ఆ ధ్రువపత్రాలు జారీ చేయటం సాధ్యం కాకపోవచ్చు. మరికొద్దిరోజుల్లో పత్తి దిగుబడులు కూడా రైతు చేతికొస్తాయి. ఆ పత్తి విక్రయాలకు కూడా ఏఈవోలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు వెంటనే పంటల నమోదును చేపట్టాలని రైతులు కోరుతున్నారు.